అసలు సంగతి చెప్పకుంటే వదలదు.

"చిన్న గొడవమ్మా. ఎవరో కస్టమర్ గొడవ చేస్తున్నాడు."

"ఏమంటున్నాడు?"

"మీ బార్ రేటెంతో చెప్పు కొనేస్తానంటున్నాడు."

"అక్కడిదాకా వచ్చిందా....? సర్ది చెప్పండి-- కష్టమర్స్‌ని మర్యాదగా చూసుకోవాలి. సైకాలాజికల్ సాటిస్‌ఫాక్షన్ ఈస్ మోర్ ఇంపార్టెంట్ దేన్ జస్ట్ ఫిజికల్ సర్వీస్."

"అతనూ అదే అన్నాడమ్మా...." అని తిరిగి నాలిక్కరుచుకున్నాడు మనేజర్.

"అతనూ అదే అన్నాడా? దెన్ హి ఈజ్ ఎ ఇంటలిజెంట్ బిజినెస్‌మెన్ . బైదిబై హు ఈజ్ దట్ గై........"

"ఎవరో మధుకర్.... ది గ్రేట్ ఇండస్ట్రియలిస్ట్ రాఘవేంద్ర నాయుడుగారి కొడుకట.." మేనేజర్ యాధాలాపంగా చెప్పాడు.

"వ్వాట్.....?" ఫోన్‌కి అవలివైపున్న మహతి ఉలిక్కిపడుతూ అరిచినట్లుగా అంది.

"అవునమ్మా..."

"ఏమంటున్నాడన్నారు?" ఆమె కంఠంలో తొంగిచూసిన ఆసక్తికి, ఆతృతకి మేనేజర్ క్షణకాలం ఆగాడు.

"బార్ రేటెంతో చెప్పు కొని అవతల పడేస్తానంటున్నాడు. ఎంత చెప్పినా వినటంలేదు. డబ్బుందన్న పొగరమ్మా-- అతనితోపాటు ఒక ఎఫ్. ఎస్ గాడొచ్చాడు. మూర్తని-- వాడిదివరకు మన బార్‌కొచ్చి బాగా తాగి డబ్బులేదంటే వాచీ ఊడబెరుక్కుని పంపించాం. అతనే ఇతన్ని రెచ్చగొట్టాడని మనవాళ్ళు చెప్పారు.

ఇవి మనకెప్పుడూ వుండేవేగా--! నేనెలాగో మేనేజ్ చేస్తాను. టూర్ బాగా సాగుతోందా తల్లీ-- బాగా ఎంజాయ్  చేస్తున్నారా? అక్కడ చలి, మంచు, వర్షం ఎక్కువట- అదే చెప్పి అమ్మ ఇక్కడ భయపడుతున్నారు. జాగ్రత్తమ్మా.... స్వెట్టర్ వేసుకోతల్లీ" మేనేజర్ తన సహజధోరణిలో అన్నాడు.

అవేమీ ఫోన్‌కి అవతల వున్న మహతి చెవికెక్కలేదు.

"నే చెప్పేది జాగ్రత్తగా వినండి చెప్పినట్లు చేయండి-- మన బార్ రేటెంతుంటుంది?" మహతి కంఠంలో తొంగి చూసిన స్థిరత్వానికి మేనేజర్ ఉలిక్కిపడ్డాడీసరి.

"అదీ..... నేను సర్దుతాగా"

"టెల్ మి ద రేట్" సీరియస్‌గా అడిగింది మహతి.

"అదీ...."

"టెల్ మి ఐసే"

"లైసెన్స్, సరుకు, గుడ్‌విల్....... అదీ కలిసి పది లక్షలదాకా వుంటుంది" గడగడా చెప్పేశాడు భయపడుతున్నట్లుగా.

" ఆ మధుకర్‌ని మీరెళ్ళి బాగా రెచ్చగొట్టండి. తిరిగి రేటడిగితే పాతిక లక్షలు -- ఏం కొంటావా? నీవల్ల ఏమవుతుంది? బాగా ఇరిటేట్ చేయండి. అతను మొండికెత్తుతాడు. కొంటానంటాడు. అప్పటి కప్పుడు ఐదురూపాయల స్టాంప్ పేపర్స్ తెప్పించి మధువన్ బార్‌ని పాతిక లక్షలకు కొన్నాను. డబ్బు వెంటనే ఏర్పాటు చేస్తున్నాను అని రాయించు కొని ప్రక్కనున్న కస్టమర్స్ సంతకాల్ని సాక్షి సంతకాలుగా తీసుకోండి.  ఇందులో తేడా వచ్చిందో ఊరుకోను."

"కాని......  అమ్మా.. అతడేదో తాగి, తమాషాకి అంటే బంగారంలాంటి బార్‌ని అమ్ముతాననటం. అయినా అతనేదో తాగిన మైకంలో అంటున్నాడు-- నిజంగా జరిగేదేనా...?"

“ఢూ... వాట్ ఐ సే..... అతను మన పదిలక్షల బార్‌ని పాతిక లక్షలకు కొంటాడు. ఐయామ్ ష్యూర్ ఎబౌట్ దట్...... కమాన్ .... మూవ్.. అరగంటాగి తిరిగి ఫోన్ చేస్తాను. అటూ, ఇటూ అయిందో... క్షమించను.”

“ఐయామ్ సారీ అమ్మా... అతనేదో ఉడుకునెత్తురు అతన్ని అలా ప్రేరేపిస్తే అలా అంటున్నాడు. నువ్వు చిన్నపిల్లవు-నువ్వూ అలా అంటే ఎలా?” మేనేజర్ సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు.

“బార్ నా పేరు మీదుంది. అవునా?”

“అవును. కానీ నాన్నగారికీ ఒకమాట చెప్పాలి. అయినా తాగుబోతు మాటల్ని సీరియస్‌గా తీసుకోవటం ఏమిటమ్మా.. కుర్రచేష్టలు కాకపోతే!”

“విల్ యూ ప్లీజ్ షట్ యువర్ మౌత్ అంకుల్?”

మేనేజర్ బిత్తరపోయాడు.

“కొన్ని నిర్ణయాలు క్షణాల్లో తీసుకోవాల్సి ఉంటుంది. క్షణకాలం.... లక్షల విలువ. ఒక్కోసారి కోట్లు. వ్యాపారవేత్త ఎప్పుడూ అవకాశం కోసం ఎదురుచూస్తుండాలి. మీరాపని ఇమ్మీడియట్‌గా చేయాలి. కావాలంటే నేనిలా చెప్పానని నాన్నగారికి చెప్పండి. అంతా క్షణాల్లో జరిగి పోవాలి” అరుస్తున్నట్లుగా అంది మహతి ఫోన్‌లో.

మేనేజర్ క్షణకాలం విస్తుపోయాడు.

“ఒక్కోసారి అతి చిన్న సంఘటన అనుకున్నదే తిప్పగల నేర్పుంటే అతిపెద్ద మలుపుకి దారితీస్తుంది. డోంట్ హెజిటేట్ టు ఒబే మై ఆర్డర్స్” తిరిగి అంది మహతి.

ఈసారి నిజంగానే మతిపోయింది మేనేజర్‌కి.

ఆమె తండ్రికి కూడా మహతిమీద, ఆమె మాటమీద, నిర్ణయం మీద మంచి గురి. కూతురి మాటెప్పుడూ తండ్రి కాదనడు.

ఫోన్‌ని అలాగే చెవికానించుకుని గొడవ జరుగుతున్నవేపు చూశాడు. అది అంతకంతకు తీవ్రరూపం దాల్చుతోంది.

"మీ ముద్దుల కూతురు సుధారాణి ఇప్పుడు నా దగ్గరే ఉంది. చెప్పినట్లు చేయలేదనుకోండి ఆమెని మీకు దక్కకుండా చేస్తాను. నేననుకున్నది జరక్కపోతే ఎవర్నీ క్షమించలేననీ మీకు బాగా తెలుసు. ఇప్పుడు నేననుకున్న మాట దక్కటమా? దక్కకపోవటమా  అన్న దాని కంటే మాకు పదిహేను లక్షలు నష్టం కూడా వస్తుంది. పదిహేను లక్షలు మాటలు కాదు. మీ జీవితాంతం మీరు నాకు ఊడిగం చేసినా పదిహేను లక్షలు సంపాదించిపెట్టలేరు. ఈ వయసులో మీరు పిల్లల్ని కనలేరు.

ఈ డీల్‌లో మీకు ఐదులక్షలు నేనిస్తాను. ఐదులక్షలు కేష్, కూతురు దక్కటం, లేదా సర్వనాశనం. బాగా ఆలోచించుకోండి. సందర్భాన్ని మనకు అనుకూలంగా మల్చండి. లేదంటే మీకు తెలుసు నేను తలచుకుంటే ఏం చేయగలనో."

ఫోన్ కట్ అయింది.

మేనేజర్‌కి ఫోన్ పెట్టేశాక కొద్దిక్షణాలు ఏమీ అర్థంకాలేదు. కాళ్ళు చేతులు ఆడలేదు. ఒళ్ళంతా చమటలు పట్టేశాయి.

సరిగ్గా అదే టైమ్‌లో మహతి మడికేరీ నుంచి ఇంటికి కాంటాక్ట్ చేసి తన తండ్రితో మాట్లాడటానికి ప్రయత్నిస్తోంది.

"ఏమిటే ఇదంతా? బార్ అమ్మటమేమిటి? ఏమంటున్నారు మీ నాన్నగారు?" సుధారాణి ఆశ్చర్యపోతూ అడిగింది.

మహతి నిర్విరామంగా తన తండ్రిని ఫోన్‌లో కాంటాక్ట్ చేసేందుకు ప్రయత్నిస్తుంటే తప్ప ఆమె అనుమానాన్ని నివృత్తి చేయలేదు.

"చెప్పవే! ఏం జరిగిందక్కడా?" ఈసారి మేరీ అడిగింది తనలో పెల్లుబుకుతున్న ఆతృతనీ బలవంతాన అణచుకొనే ప్రయత్నం చేస్తూ.

“మధుకర్ మా బార్ కొచ్చాడు. బాగా తాగాడు-తప్పతాగాడు. అతని ప్రక్కకి ఒక ఎఫ్. ఎస్. గాడున్నాడు. మా బార్‌లో సర్వీస్ బాగాలేదని రెచ్చిపోయి బార్ రేటెంతో చెప్పు, కొంటానని రెచ్చిపోతున్నాడట. పదిలక్షలు ఖరీదుచేసే బార్‌ని పాతిక లక్షలకు అమ్మమని చెప్పాను. అర్థమైందా? కాసేపు నోరుమూసుకుని కూర్చుని ఏం జరుగుతుందో చూడండి. అని ఒక్కక్షణం ఆగి-- “హలో ఈజిట్ 223224?” ప్రశ్నించింది పెద్దగా మహతి.

మేరీ, సుధారాణి షాక్‌తిని అలాగే చూస్తుండిపోయారు.

* * * *

అప్పుడు సమయం రాత్రి పదిన్నర.......

పొగమంచు ఆ పర్వత శ్రేణువుల్ని దుప్పటిలా కప్పేసుకుంది. ఫైర్ ప్లేస్ చుట్టూ పడకల్ని సర్దుకొని నిద్రలోకి జారుకున్నారా ప్రాంత ప్రజలు.

పగలు విరాజ్‌పేట, అక్కడినుంచి కేరళ సరిహద్దుల వరకు వెళ్ళి వచ్చిన స్టూడెంట్స్ అలసిపోవటమే కాక, చిరుజల్లులకు తడిసి ఉండటంతో కడుపులోకి మోకాళ్ళను ముడుచుకొని నిద్రలోకి జారుకున్నారు. చలి విశ్వరూపం ధరించింది.

గెస్ట్‌హౌస్ నిశ్శబ్దంలో, నిశీధిలో కలిసిపోయింది. ప్రస్తుతం మహతి, మేరీ, సుధారాణి ఉన్న గదిలోనే ఒక లైట్ వెలుగుతోంది.

ఎంత ప్రయత్నాన్ని చూసిన మేరీ, సుధారాణి కన్నార్పకుండా అలా చూస్తూ శిలా- ప్రతిమలయిపోయారు.

అందం, ఆకర్షణ, మేని ఒంపుసొంపుల్లో సెక్సీనెస్, తెలివితేటలు, సమయస్ఫూర్తి, చురుకుదనం, పట్టుదల, ఆత్మాభిమానం, అభిజాత్యం, సోషల్ గ్రేసెస్‌తో పాటు బలంగా, ఆరోగ్యంగా, అణువుణువునా యవ్వనం తొంగిచూసే మహతి వారికెప్పుడూ ఒక ఎనిగ్మాగానే మిగిలి పోతుంది. ఇది ఆమె మనస్థత్వం అని ఖచ్చితంగా నిర్వచించలేని ఆమె ఎప్పటికీ అన్ ప్రెడిక్టబుల్‌గానే వుండిపోతుందా?

మధుకర్‌ని అమితంగా ప్రేమించింది.

చూడకుండా ఒక్కక్షణం ఉండలేకపోయేది.

ఎప్పుడూ అతని ఊసులతోనే తన ఆలోచనల్ని నింపుకొనేది.

ఎవర్నీ లెక్కచేసేదికాదు. వాళ్ళ మధ్య నడిచిన స్వీట్ నథింగ్స్.... కథలు కథలుగా కాలేజీ క్యాంపస్‌ని ఎప్పుడూ వెచ్చదనంతో నింపేవి. అతనూ అంతే.

అప్పుడూ ఎవర్నీ కేర్ చేయలేదు. ఇప్పుడు విభేధాలొచ్చి విడిపోయే స్థితికి చేరుకున్నా ఎవ్వర్ని లెక్కచేయటంలేదు. ఎవరి సలహాలు వినటంలేదు.

మడికేరి మంచుపొరల మృదుత్వంలో, చిరుజల్లుల చిత్తడి అనుభూతిలో, బయోలాజికల్ నీడ్స్‌కి అవకాశం కల్పించుకొని, మధురానుభూతుల్ని అనుభూతించలేకపోవటం దురదృష్టం కాదా!

సుధారాణి  కన్నుగీటి, చెప్పులు లేకుండా, మెత్తటి, మృదువైన పాదాల్ని మంచుగడ్డల్లా వున్న చలువరాతి బండలపై వేస్తూ, పిల్లిలా గది దాటి వరండాలో స్థంభం చాటుకున్న యువకుడ్ని చేరి లతలా పెనవేసుకుంటోంది మేరీ.

స్త్రీ, పురుషుల మధ్య నడిచే శృంగార కార్యక్రమానికి ప్రకృతి, వాతావరణం కూడా సహకరిస్తే, ఆ అనుభూతి రెట్టింపువతుందంటాడు వాత్సాయనుడు. చలి, ఒంటరితనం, నిశ్శబ్దం, మూగసాక్షిగా మిగిలిపోయిన ప్రకృతి, చిరుజల్లులు, వెచ్చదనం వెతుకులాటలో ఉద్భవించని స్వేదం, చరిచేరని అలసట, చలిని తరిమేందుకయినా దగ్గరకాక తప్పని వాతావరణం, ఐదడుగుల వెడల్పు, పొడవు వున్న పూర్వకాలంనాటి సున్నం స్థంభం మాటున ఊర్పులు, నిట్టూర్పులు, ఆతృత, ఆరాటం, పెనుగులాట....

మేరీ ప్రవర్తన, కదలిక, సుధారాణిలో పెనుతుఫానుని రేపింది. ఆమేం చేయటానికి వెళ్ళిందన్న ఆలోచనలే ఈమెని నిలువనివ్వలేదు. మహతి అలాగే ఫోన్‌లో కుస్తీ పడుతుండగానే సుధారాణి లేచింది. పరుగులెత్తుతున్న ఆలోచనలు, ఆవిర్లు చిమ్ముతున్న పెదవులు, అదురుతున్న పాదాలు, ద్వారబంధంవేపు కదిలాయి. లైన్ దొరకలేదు మహతికి.

తిరిగి బార్‌కి చేసేందుకు ప్రయత్నించసాగింది.

*          *               *          *

"విషయం నా కర్థమయింది. పదే పదే చెప్పనక్కర్లేదు. అమ్మాయి చెప్పినట్లే చేయండి. మహతి ఆలోచనా విధానం హర్షణీయమైన దారిలోనే సాగుతోంది. ఎంతో ఆలోచించుకున్న మీదటకాని ఒక నిర్ణయానికి రాని నా కూతురు మహతి ఆలోచనల చివర ఔచిత్యం, వివేకం ఉంటుంది. వ్యాపారంలో సత్వర నిర్ణయాల మూలంగా దుష్ఫలితాలు గూడా వుంటాయి. కాదనను. అలాగే ఇన్‌స్టెంట్ డెసిషన్స్‌కి సరయిన ఆలోచనా పునాది లేదని, ఆ నిర్ణయాలు  ఆమెచ్యూర్డ్ అని కూడా అనలేం కదా? తరాలు మారుతున్నాయి. తరాలతోపాటు అన్నిటా వేగం పెరుగుతోంది. కొత్త తరాల ప్రతినిధులకుండే ఐక్యూ ముందు మనది నామమాత్రమయిపోతుంటుంది.  అమ్మాయి చెప్పినట్లు అతన్ని రెచ్చగొట్టి, బార్‌ని పాతిక లక్షలకు అమ్మేసేయ్. నా తరపున, అమ్మాయి తరపున నీవే ప్రతినిధిగా వ్యవహరించు.

అమ్మాయి నీకు ప్రామిస్ చేసిన ఐదు లక్షలు నీకు అందుతాయి. అందుకు నేనూ హామీ ఇస్తున్నాను.

యుద్ధంలో ఒక్కక్షణం విలువ కొన్ని లక్షల ప్రాణాలు.

వ్యాపారంలో ఫ్రాక్షన్ ఆఫ్ సెకెండ్..... విలువ! కోట్లలో కూడా ఉంటుంది. ఒక్కోసారి.

ఏదో అర్థం పరమార్థం లేందే అంత తేలిగ్గా ఒక నిర్ణయానికి రాని నా కూతుర్ని నీ ఆలోచనల్ని, అనుభవాల్ని సమర్థించటం ద్వారా కించపర్చలేను. బై" అన్నాడు మహతి తండ్రి రాజేంద్రప్రసాద్ స్థిరంగా. ఫోన్ పెట్టేసిన మేనేజర్‌లో క్షణకాలం ఆలోచనలు స్తంభించి పోయాయి. ఆపైన షార్ప్‌గా రియాక్ట్ అయి వడివడిగా మధుకర్ ఉన్న దగ్గరకు వెళ్ళాడు. అప్పటికీ ఇంకా గొడవ జరుగుతూనే ఉంది.

మరికొంతసేపు అతనికి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు.

ఆపైన తన ఆత్మాభిమానాన్ని ప్రదర్శించుకున్నాడు.

తనకు అవమానం జరిగినట్లు బాధపడ్డాడు, బాధ పడ్డట్లు నటించాడు. మధుకర్ తనని కించపరిచినట్లు ప్రవర్తించాడు. చివరగా తను రెచ్చిపోయి మధుకర్‌ని రెచ్చగొట్టాడు.

“పెద్ద కొనేవాడి క్కూడా చెల్లదు కొంటావా? నీ కంత దమ్ముందా? అసలు నీ దగ్గర... నువ్వూ, నీ ఫ్రెండ్ తాగిన మందుకు బిల్లు కట్టేందుకు డబ్బులున్నాయా?” అసంకల్పితంగా, సందర్భాన్ని బట్టి రెచ్చిపోయే మనిషికి, కావాలని అవతల వ్యక్తిని రెచ్చగొట్టే వ్యక్తికి మధ్య చాలా తేడా ఉంటుంది. పదాల దొర్లింపులో వ్యత్యాసం ఉంటుంది.

దూకుడు...... సంయమనం........ భిన్న ధృవాలు.

“బిల్లుకు డబ్బులు లేవా! పిచ్చిపిచ్చిగా ఉందా? అసలు నీ బ్రతుకు, నీ బార్ బ్రతుకెంతో నీకు తెలుసా? మాకు మందు సప్లై చేయగల అర్హత నీ బోడి బార్‌కుందా?” మంట చల్లారిపోవటం మూర్తికి ఇష్టం లేదు. అందుకే తిరిగి మరికొంత ఆజ్యం పోశాడు.

ఎవరికి వారే మేనేజర్, మూర్తి సూత్రధారులు అయిపోతే మధ్యనున్న మధుకర్ మరింత ఫైరయిపోయాడు.